క్లుప్తంగా

మంత్రి ధర్మాన, కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు


మంత్రి ధర్మానకు మొక్కను అందజేస్తున్న దామోదరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిట్ట దామోదర రావు నియమితులయ్యారు. దీంతో తనను నియమించినందుకు మంత్రి ధర్మాన ప్రసాద రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్‌లను వారి నివాసాల్లో సోమవారం మర్యాద పూర్వ కంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారురు. వెనుకబడిన కులానికి చెందిన తమను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటా నన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్సీలుకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యన్నదాన పథకానికి రూ. 50 వేల వితరణ


విరాళం అందజేస్తున్న దాతలు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకానికి నరసన్నపేటకు చెందిన పొట్నూరు కృష్ణారావు, మాధురి దంపతులు 50,116 రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో గురునాథానికి సోమవారం అందజేశారు.

108 మందికి కళ్లద్దాలు పంపిణీ


కంటి అద్దాలను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సర్వేంద్రియానం నయనం ప్రధానమని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు హారికాప్రసాద్ అన్నారు. బాపూజీ కళామందిరంలో సోమవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మందికి కళ్లద్దాలను అందజేశారు. ఐ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్లబ్ ఉపాధ్యక్షుడు వావిలాపల్లి జగన్నాథంనాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కరణం శోభారాణి, వైద్యులు చింతాడ కృష్ణమోహన్, దినేష్, మేడిశెట్టి సత్యస్వరూప్, కరణం హారిక, ఇంటిక్ మాజీ కన్వీనర్ రాధాప్రసాద్, శాహుకారి నాగేశ్వరరావు, ఐ ఎక్స్ ప్రెస్ ప్రతినిధులు సుమన్, లక్ష్మణ్, లక్ష్మీకాంత్, శాసపు జోగినాయుడు, స్వీప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, నేహార్, ఢిల్లీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉమారుద్రునికి విశేష పూజలు


పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధి నాగావళి నదీ తీరంలో ఉన్న ఉమారుద్రకోటేశ్వర స్వామికి మాఘమాస సోమవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సమన్వయంతో పని చేయాలి


వీఆర్‌ఓలకు సూచనలిస్తున్న డీటీ నిర్మల

జి.సిగడాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయిలో పని చేస్తున్న వీఆర్‌లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నిర్మల అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ నుంచి మండల స్థాయి వరకు వివిధ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. బూత్ లెవల్ అధికారులు అంకిత భావంతో పని చేయాలన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన పనులు

ఎచ్చెర్ల: గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన పనులను చేపట్టి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెలుగు ఎచ్చెర్ల క్లస్టర్ ప్రాంతీయ సమన్వయకర్త పి.రవికుమార్ తెలిపారు. ఎచ్చెర్ల వెలుగు కార్యాలయానికి సోమవారం విచ్చేసిన ఆయన ఇక్కడ సీసీలతో సమావేశాన్ని నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటి వసతిని కల్పించేందుకు కమ్యూనికేషన్ కాంట్రాక్ట్ పద్ధతిని వినియోగించడం జరుగుతుందన్నారు. దీని కోసం పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తోపాటు ఆ గ్రామానికి చెందిన 9 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులతో కూడిన కమిటీలను వేశామన్నారు. వీరంతా బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారని, వీరి ఖాతాలకు ఫండ్స్ రిలీజ్ చేస్తామన్నారు. వీరి ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన కుళాయిలు నిర్మించడం జరుగుతుందన్నారు. ఎచ్చెర్లలో 111, రణస్థలంలో 70, లావేరులో 9, జి.సిగడాంలో 18, పొందూరులో 9, ఆమదాలవలసలో 19 వర్కులను చేపట్టనున్నామన్నారు. ఇంకా బ్యాంక్ ఖాతాలను ప్రారంభించని కమిటీ సభ్యులంతా త్వరితగతిన బ్యాంక్ ఖాతాలను ప్రారంభించాలన్నారు.

ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళులు


శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: భారత వీరత్వానికి ప్రతీకగా నిలిచిన గొప్పయోధుడు ఛత్రపతి శివాజీ అని గాంధీ మందిరం కమిటీ సభ్యులు కొనియాడారు. శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీ గాంధీ మందిరంలో శివాజీ మహారాజ్ 397వ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మందిర కమిటీ ప్రతినిధులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. శివాజీ పేరు భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. ఈ పేరు వింటేనే భరతావని పులకించిపోతుందన్నారు. మొఘలుల దాడుల నుంచి హిందూ మతాన్ని రక్షించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం అవగాహన పండితులు పైడి హరనాథరావు ఛత్రపతి శివాజీ గొప్పతనాన్ని కీర్తిస్తూ పద్యం ఆలపించారు. గాంధీ మందిర కమిటీ అధ్యక్షునిగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న డాక్టర్ చింతాడ కృష్ణమోహన్‌ను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో విగ్రహ దాత చింతాడ కృష్ణమోహన్, రాజశేఖర్‌తోపాటు గాంధీ మందిర ప్రతినిధులు సురంగి మోహనరావు, జామి భీమశంకర్, నటుకుల మోహనరావు, హారిక ప్రసాద్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, కె.వేణుగోపాలరావు, పందిరి అప్పారావు, మెట్ట అనంతం బొట్లు, పి పద్మావతి, పైడి హరినాథరావు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై ఖాతాదారులకు అవగాహన

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన కల్పించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ అన్నారు. సోమవారం శ్రీకాకుళంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించి కేంద్రాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్)పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారమైన ఓటీపీ, పిన్ నంబర్లనుం గోప్యంగా ఉంచాలన్నారు. ఈ ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రజలు బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన పొందాలన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.సూర్య కిరణ్ మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో గతంలో ఆరు సీఎఫ్‌ఎల్ సెంటర్లు నడుస్తున్నాయన్నారు. కొత్తగా మరో మూడవ ఫేస్‌లో ఆరు కేంద్రాలను వివిధ మండలాల్లో సోమవారం ప్రారంభించామన్నారు. కొత్త సీఎల్ కేంద్రాలతో కలుపుకొని జిల్లాలో అన్ని మండలాల్లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల సేవలు అందుబాటులోకి వచ్చినట్టు వివరించారు.

కార్యక్రమంలో శ్రీకాకుళం సీఎఫ్‌ఎల్ నోడల్ ఆఫీసర్ పి.అనిల్ కుమార్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్టేట్ కోఆర్డినేటర్ కె.అశోక్, డిస్టిక్ కోఆర్డినేటర్ హరినాథ్, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్స్ అవినాష్, కల్యాణి పాల్గొన్నారు.


ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వైభవంగా నరసింహస్వామి తిరువీధి


ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎండోమెంట్ ఏసీ ప్రసాద్ పట్నాయక్


తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

గార: శాలిహుండం కొండ దిగువన ఉన్న నరసింహ స్వామి ఆలయ ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. శాలిహుండం జాతర జరగనుండటంతో ముందుగా నరసింహస్వామి మూర్తులను గ్రామాల్లో పల్లకిలో ఊరేగించారు. శాలిహుండం, కొత్తపేట, బోరవానిపేట, తంగుళ్లపేట గ్రామాల్లో ఊరేగింపు జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధు రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని హారతులు పట్టారు. మంగళవారం ఉదయం వంశధార నదిలో చక్రతీర్థ స్నానం, కొండపైన దర్శనాలు ఉండటంతో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో 130 మంది పోలీసులు విధుల్లో పాల్గొననున్నారు. శాలిహుండం కొండపై జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి బలివాడ ప్రసాద్‌పట్నాయక్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి పాల్గొన్నారు.

చంద్రపతి కుటుంబానికి మంత్రి పరామర్శ


చంద్రపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ, బహుజన కులాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి పిట్ట చంద్రపతి అని.. అటువంటి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో చంద్రపతి నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. చంద్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, బడాన దేవభూషణరావు, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అమిరుల్లా బేగ్, గంజి ఆర్ ఎజ్రా, వంజరాపు రాజులు, పసగాడ రామకృష్ణ, ఢిల్లీరావు, కాళ్ల వేణు, బద్రి సీతమ్మ, పాపారావుస్వామి ఉన్నారు.

మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి తెలిపారు. నా భాష అంటే నాకు ఇష్టం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి కవి సమ్మేళనం, కవులకు సన్మానం, మాతృభాషపై కవులు, కళాకారులతో ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

ఆక్రమణలు అడ్డుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురంలోని ఏపీ గురుకుల పాఠశాల ఆవరణలోని స్థలాన్ని ప్రభుత్వం పాఠశాల అవసరాల కోసం గతంలో కేటాయించారు. ఈ స్థలం ఆక్రమణలకు గురవుతుందని, ఆక్రమణలను అడ్డుకోవాలని ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఆధ్వర్యంలోని ఉపాధ్యాయులు ఎచ్చెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. మండల అధికారులు జిల్లా కలెక్టరేట్ స్పందనలో వర్చువల్‌గా హాజరై అందుబాటులోకి వచ్చారు. గురుకుల పాఠశాల స్థలాన్ని సర్వే చేస్తామని తహసీల్దార్ వి.శ్యాంకుమార్ తెలిపారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అడ్డుకుంటామన్నారు. స్థానిక వీఆర్వోకి ప్రస్తుత పరిస్థితిపై నివేదిక అందజేయాలని సూచించారు. అరిణాంఅక్కవలస పంచాయతీ పట్టు శాలిపేటలో ఉన్న ప్రభుత్వ భూమి తప్పుడు సర్వే నంబర్‌తో కొందరు విక్రయించాలని చూస్తున్నారని గ్రామానికి చెందిన ధనాలుకోటి రమణ ఫిర్యాదు చేశారు. ఈ స్పందనలో ఎంపీడీఓ రమాదేవి, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, వెలుగు ఏపీఎం రామ్మూర్తి, ఉపాధి హామీ ఏపీఎం శోభాదేవి పాల్గొన్నారు.

పరామర్శ..


ముగ్గు శ్రీనివాసరావును పరామర్శిస్తున్న సాయికుమార్

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మధుపాం మాజీ సర్పంచ్ ముగ్గు సత్యం నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు కింజరాపు జగన్మోహన్, రాంబల్లి రామారావు, నల్లి వెంకయ్య, అనకాపల్లి జనార్దన్, ముగ్గు సన్యాసి, మాజీ ఎంపీటీసీ మింది శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు


కుప్పిలిలో పండిస్తున్న అంతర పంటలు

ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల వంటి వర్షాధార ప్రాంతాల్లో అంతరపంటలకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకేచోట పలు రకాల పంటలను వేయడం వల్ల ఒక పంటపోయినా మిగతా పంటలు పండటం వల్ల లాభం ఉంటుందని రైతులు అంటున్నారు. కొబ్బరి, ముల్లంగి, బెండ, మిరప, అరటి పంటలను ఒకేచోట వేసి పండిస్తున్నారు. దీనివల్ల తక్కువ భూమిలో తక్కువ పెట్టుబడితో పలు రకాల ఉత్పత్తులను పండించవచ్చని రైతులు అంటున్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

కాశీబుగ్గ: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని పలాస అగ్నిమాపక కేంద్రం అధికారి బొమ్మాళి సోమేశ్వరరావు అన్నారు. కేంద్రం ఎదురుగా సోమవారం ఫైర్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎక్కువ అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉందని.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం నిర్వహించారు.

నేత్రపర్వంగా మహామృత్యుంజయేశ్వరుని ప్రతిష్ట


మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

కవిటి: ముత్యాలపేటలో నూతనంగా నిర్మించిన అమృతవర్షిణీ సమేత మహామృత్యుంజయేశ్వర స్వామి, మోక్షసీతారామస్వామి, షిర్డీ సాయి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిల ఆలయాల ప్రతిష్ఠ కనులపండువగా నిర్వహించారు. సోమవారం వేకువ జామునుంచే ఆలయానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. పూజల్లో భాగంగా యంత్రస్థాపన, గర్తన్యాసము, విగ్రహప్రతిష్ట, శిఖరప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, నందివాహన ప్రతిష్ట ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. 24 గంటలపాటు హరేరామ హరేకృష్ణ తారకనామమంత్ర యజ్ఞం జరిగింది. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం స్వామివారి తిరువీధి ఉత్సవం కన్నులపండువగా నిర్వహించారు.


కనులపండువగా రామమందిర ప్రతిష్ఠ


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

గార: జొన్నలపాడు కాలనీలోని శ్రీరామమందిర ప్రతిష్ఠ సోమవారం కనుల పండువగా జరిగింది. గ్రామపురోహితులు దార్లపూడి కామేశ్వరశర్మ, మావుడూరి మోహనశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఆరవెల్లి బాలభాస్కరశర్మ, వారి అర్చకబృందంచే శాస్త్రోక్తకంగా ప్రతిష్ఠ నిర్వహించారు. యంత్రస్థాపన అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మూర్తులను ప్రతిష్ఠించారు. ముందుగా భక్తులు దర్పణ దర్శన అనంతరం దర్శనాలు జరిగాయి. ప్రతిష్ఠానంతరం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పూజల్లో పాల్గొన్నారు. సుమారు ఐదు వేల మందికి మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, గొండు శంకరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతిష్ఠలో పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పులకించారు.


ప్రతిష్ఠామూర్తులకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

హర్షవల్లి చరిత్ర-సంస్కృతి పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన తదితరులు

శ్రీకాకుళం రూరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ చరిత్రకు సంబంధించి పుస్తకాన్ని రచించడం శుభపరిణామమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు రచించిన 'హర్షవల్లి చరిత్ర-సంస్కృతి' పుస్తకాన్ని పెదపాడులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మాన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరసవల్లి దేవస్థానానికి సంబంధించిన చరిత్ర, సంస్కృతులతో సమగ్రమైన గ్రంథం ఏదీ ఇప్పటివరకూ రాలేదన్నారు. తన కోరిక మేరకు వామపక్ష భావాలున్న సీనియర్ జర్నలిస్టు హర్షవల్లి పేరిట పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు. జిల్లాకు సంబంధించిన చరిత్ర, సంస్కృతులను వెలికితీయడం ద్వారా భావితరాల రచయితలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ధర్మారావు మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. జిల్లా చరిత్ర-సంకస్కృతి అనే పరిశోధన గ్రంథాన్ని త్వరలో రాస్తానని ఈసందర్భంగా ధర్మారావు వెల్లడించారు. కార్యక్రమంలో కళింగాంధ్ర సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గురుగుబెల్లి లోకనాథం, శ్రీశైన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, డీకే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రధాన కార్యదర్శి దుప్పల రవీంద్రబాబు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సూర శ్రీనివాసరావు, న్యాయవాది పాలిశెట్టి మురళీకృష్ణ, శిమ్మ రాజశేఖర్, బొడ్డేపల్లి మోహన్‌రావు, ధర్మాన ఉదయ్‌భాస్కర్, మండవల్లి రవి, పొన్నాడ రుషి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

జి.సిగడాం: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఎంపీడీఓ కుచ్చెర్లపాటి కృష్ణంరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్మూలన, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం పనుల్లో జిల్లాలోనే జి.సిగడాం మండలం నంబర్ వన్ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈఈలు మహదాసుల రమేష్, శ్రీవల్లి, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణంరాజు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం


ఆకు కూరలను విక్రయిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ కార్యాలయాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన కూరగాయలను సోమవారం విక్రయించారు. సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడులతోపాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తోందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సేంద్రియ ఎరువులో పండించిన కూరగాయలను తెచ్చి స్పందనకు వచ్చిన ప్రజలకు విక్రయించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ప్రతిఘటనోద్యమానికి దిక్సూచి జయమ్మ

మందస: సమరశీల ప్రతిఘటనోద్యమానికి దిక్సూచి ధీరవనిత జయమ్మ అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గౌరకల బాలకృష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.కుసుమ అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతాలైన కుల్లోగాం, కిల్లోయి, బంసుగాం, బలియాగాం తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. త్యాగాల జయమ్మ నడిచిన త్యాగాల బాటలో నడవమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ నెల 22న జరిగే జయమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, జడ్డే అప్పయ్య, బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, నరసింహులు, తవుడు, రామ్మూర్తి, జానీ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు